## నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలి

బోథ్, మే 29: రైతులు ప్రభుత్వం ద్వారా గుర్తింపు పొందిన విత్తనాలు మాత్రమే కొనుగోలు చేయాలని వ్యవసాయాధికారి వెండి విశ్వామిత్ర సూచించారు. బుధవారం చింతగూడ, బాబేర గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేంద్రియ ఎరువులు వేయాలని సూచించారు. రైతులకు సరిపడా విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. బయట వ్యక్తులు వచ్చి విత్తనాలు విక్రయిస్తే వ్యవసాయాధికారులు, పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

## నేటితో ముగియనున్న జొన్నల కొనుగోళ్లు

జైనథ్, మే 29: జైనథ్, ఇంద్రవెల్లి వ్యవసాయ మార్కెట్ ఆవరణలో జొన్నల కొనుగోళ్లు గురువారం సాయంత్రం ముగిస్తుందని జైనథ్, ఇంద్రవెల్లి పీఏసీఎస్ సీఈవోలు గంగన్న, ధరంసింగ్ వేర్వేరు ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని జైనథ్, బేల, ఇంద్రవెల్లి మండలాల్లోని జొన్నల రైతులు గమనించాలని సూచించారు.

## ఉపాధి హామీ పనుల పరిశీలన

నార్నూర్, మే 29 : ఉమ్రి గ్రామంలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను బుధవారం టెక్నికల్ అసిస్టెంట్ జాదవ్ సచిన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కూలీకి 100 రోజులు పని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కొలతల ప్రకారం కూలీ డబ్బులు చెల్లించడం జరుగుతుందని తెలిపారు. ఆయన వెంట కూలీలు ఉన్నారు.

## వారసంత స్థలంలోనే అమ్మకాలు కొనసాగించాలి

ఖానాపూర్, మే 29 : పట్టణంలో బుధ, ఆదివారాల్లో నిర్వహించే వారసంత స్థలంలోనే కూరగాయల వ్యాపారులు తమ అమ్మకాలను కొనసాగించాలని మున్సిపల్ చైర్మన్ రాజురా సత్యం కోరారు. బుధవారం వారసంత స్థలంలో వెలిసిన దుకాణాలను నాయకులతో కలిసి పరిశీలించారు. రోడ్లపై చిరువ్యాపారులు అమ్మకాలను కొనసాగించరాదని పలు సూచనలు చేశారు. మున్సిపల్ సిబ్బంది ఏర్పాటు చేసిన మార్కింగ్ స్థలంలో తమ సరుకులు విక్రయించాలని సూచించారు. ఇటీవల రోడ్లపై అమ్మకాలను నిషేధించడంలో సహకరించిన వ్యాపారస్తులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ కావలి సంతోష్, నాయకులు ఉన్నారు.

## జూన్ 3 నుంచి బడిబాట నిర్వహించాలి

నిర్మల్ అర్బన్, మే 29 : నిర్మల్ జిల్లాలో జూన్ 3వ తేదీ నుంచి బడిబాట నిర్వహించాలని జిల్లా విద్యాధికారి రవీందర్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర విద్యాశాఖ మార్గదర్శకాల ప్రకారం ఈ నెల 11వ తేదీ వరకు ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, పాఠశాలలో నమోదు శాతం పెంచేందుకు బడిబాటను నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. 12న పాఠశాలలను పునఃప్రారంభించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.

## విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి

సారంగాపూర్, మే 29: కుప్టితండా గ్రామంలో చవాన్ మాన్‌సింగ్ అనే రైతుకు చెందిన ఎద్దు బుధవారం విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. గ్రామ శివారులో ఉదయం మేతమేయడానికి వెళ్లిన ఎద్దు ఈదురుగాలులకు తెగిపడిన విద్యుత్ తీగలకు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు విలువ రూ.70వేలు ఉంటుందని, ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని రైతు కోరుతున్నాడు.

## చిరు వ్యాపారులకు సహకరించాలి

ఖానాపూర్ టౌన్, మే 29 : ఖానాపూర్ పట్టణంలో ప్రతి బుధ, ఆదివారం నిర్వహించే వారసంతలో వ్యాపారస్తులకు మున్సిపల్ అధికారులు సౌకర్యాలు కల్పించి వారికి సహకరించాలని సీపీఐ నిర్మల్ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎల్‌ఆర్ ఉపాలి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వారం రోజుల నుంచి చిరు వ్యాపారులను ఇబ్బందులకు గురిచేయడం మున్సిపల్ అధికారులకు తగదని సూచించారు. చిరు వ్యాపారులపై నియమ, నిబంధనల పేరుతో వారి పొట్టకొట్టే విధానాలు మానుకోవాలని అన్నారు. చిరు వ్యాపారులను ఇబ్బందులకు గురిచేస్తే జిల్లా ఉన్నతాధికారులకు వ్యాపారులతో కలిసి ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.

# విత్తనాలు అందుబాటులో ఉంచాలి

- ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్



అదనపు కలెక్టర్ శ్యామలాదేవికి వినతిపత్రం ఇస్తున్న ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, నాయకులు

ఎదులాపురం, మే 29 : ఆదిలాబాద్ జిల్లాలో రైతులకు సరిపడే విధంగా విత్తనాలు అందుబాటులో ఉంచాలని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, బీఆర్ఎస్ నాయకులు బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకుడు రోకండ్ల రమేశ్, మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ మాట్లాడుతూ పత్తి విత్తనాలను సకాలంలో రైతులకు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. పంటలకు నీరు, విత్తనాల సరఫరాలో నిర్లక్ష్యం చేస్తుందన్నారు. రైతు భరోసా పేరున ఎకరానికి రూ.15వేలు ఇస్తామని చెప్పి విస్మరించిందన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూశామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురి చేస్తుందని మండిపడ్డారు. వానకాలంలో రైతులకు సరిపడే విధంగా విత్తనాలు అందుబాటులో ఉంచాలని లేనిపక్షంలో రైతుల పక్షాన ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఆదిలాబాద్ ఎంపీపీ గంద్రత్ రమేశ్, నాయకులు మెట్టు ప్రహ్లాద్, విజ్జగిరి నారాయణ, లింగారెడ్డి, తిరుపతి, గంగయ్య, శ్రీనివాస్, రాజన్న ఉన్నారు.

## నూతన కార్యవర్గం ఎన్నిక



బిల్లా శంకర్, అధ్యక్షుడు

ఖానాపూర్ టౌన్, మే 29 : సహకార భారతి అనుబంధ మాక్స్ సొసైటీ ఖానాపూర్ అడ్‌హక్ చైర్మన్‌గా బిల్లా శంకర్‌ను బుధవారం ఎన్నుకున్నారు. పీఆర్టీయూ భవన్‌లో జిల్లా బాధ్యుల ఆధ్వర్యంలో కమిటీని ఎన్నుకున్నట్లు సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. వైస్ చైర్మన్‌గా మహజన్ జితేందర్, ప్రధాన కార్యదర్శిగా ఏ శ్రీనివాస్, కోశాధికారిగా దాసరి నర్సయ్య, సహాయ కార్యదర్శిగా మంత్రరాజ్యం సురేశ్, డైరెక్టర్‌గా పడాల ప్రభాకర్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గంగాధర్, నూకల విజయ్‌కుమార్, పురుషోత్తం, భీంరావ్, కిషన్‌రావ్ పాల్గొన్నారు.

## ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి



సిరికొండలో కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో బాల గంగాధర్ తిలక్

ఇచ్చోడ(సిరికొండ), మే 29 : జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని సిరికొండ ఎంపీడీవో బాల గంగాధర్ తిలక్ అన్నారు. సిరికొండ మండలంలోని పోచంపల్లి గ్రామంలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఎంపీవో భీంరావ్, టీఏ, ఎఫ్ఏ, కూలీలు ఉన్నారు.

# నకిలీ విత్తనాలు అమ్మిన వారిపై చర్యలు



మాట్లాడుతున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్

ఉట్నూర్, మే 29: నకిలీ విత్తనాలు అమ్మిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదిలాబాద్ జిల్లాలో ఎక్కువ మంది రైతులు పత్తిపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. దీనిని ఆసరాగా చేసుకున్న కొందరు నకిలీ విత్తనాలు విక్రయిస్తూ రైతులను ముంచే ప్రయత్నం చేస్తున్నారన్నారు. అటువంటి వారిపై ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకుంటుందన్నారు. నకిలీ విత్తనాలు రూపుమాపేందుకు కమిటీ నిరంతరం కృషి చేయాలన్నారు. జిల్లా కేంద్రంలో రైతులపై లాఠీచార్జి చేశారంటూ నాయకుల తప్పుడు ప్రచారం చేయడం సరికాదన్నారు. లాఠీచార్జి చేయలేదని ఎస్పీ గౌస్ ఆలం సైతం ప్రెస్‌మీట్ ద్వారా వివరించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. సమావేశంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ, నాయకులు ఖయ్యూం, చంద్రయ్య, రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

# పైపులైన్‌కు మరమ్మతులు

ఇంద్రవెల్లి, మే 29: హీరాపూర్ గ్రామంలో పలిగిపోయిన మిషన్ భగీరథ పైపులైన్‌కు ఇంద్రవెల్లి గ్రామ పంచాయతీ అధికారులు మరమ్మతులు చేశారు. బుధవారం ఇంద్రవెల్లి గ్రామ పంచాయతీ ఈవో సంజీవరావ్ ఆదేశాల మేరకు జీపీ సిబ్బంది నారాయణతో పాటు కొంతమంది కార్మికులు పలిగిపోయిన పైపులైన్‌ను తొలగించి వాటి స్థానంలో కొత్త పైపులు ఏర్పాటు చేసి నీరు వృథాపోకుండా చర్యలు తీసుకున్నారు. దీంతో గ్రామస్తులు పంచాయతీ అధికారులతో పాటు సిబ్బందిని అభినందించారు.



పలిగిన మిషన్ భగీరథ పైపులైన్‌కు మరమ్మతులు చేస్తున్న పంచాయతీ సిబ్బంది

## మొక్కలను సంరక్షించాలి



నర్సరీ పరిశీలిస్తున్న ఇచ్చోడ ఎంపీడీవో లక్ష్మణ్

ఇచ్చోడ, మే 29 : హరితహారం కోసం నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను సంరక్షించాలని ఇచ్చోడ ఎంపీడీవో లక్ష్మణ్ అన్నారు. బుధవారం ఇచ్చోడ మండలం మన్కపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన నర్సరీని పరిశీలించారు. వర్షాకాలనికి మొక్కలు నాటేందుకు సిద్ధం చేయాలన్నారు. ఆయన వెంట టీఏ సుజాత, ఎఫ్ఏ ఉన్నారు.

## విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి



అంబకంటిలో ప్రచారం చేస్తున్న కుంటాల గ్రామస్తులు

కుంటాల, మే, 29 : గత కొన్నేళ్ల కృషి ఫలితంగా కుంటాల మండలానికి ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరైంది. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తాత్కాలికంగా కేటాయించిన భవనంలో ప్రభుత్వ కళాశాల గతేడాది ప్రారంభమైంది. కళాశాలలో విద్యార్థులను చేర్పించాలని కోరుతూ గ్రామస్తులు ఇంటింటా ప్రచారం చేశారు. బుధవారం అంబకంటి, తాండల్లో అడ్మిషన్ల కోసం సందర్శించి విద్యార్థులను చేర్పిస్తున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు కృష్ణారావు, గజేందర్, రమేశ్, సురేశ్ పాల్గొన్నారు.

# కూచిపూడి నృత్యంలో స్వర్ణనంది పురస్కారం





ప్రతిభ కనబర్చిన సరిత, హరిత

నిర్మల్ అర్బన్, మే 29 : హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయంలో శిఖరం ఆర్ట్స్ థియేటర్ అకాడమీ ఆధ్వర్యంలో నందమూరి తారక రామారావు 101వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని నిర్వహించిన నృత్య ప్రదర్శనలో నిర్మల్‌కు చెందిన అనంతుల సరిత అత్యుత్తమ కూచిపూడి నృత్య ప్రదర్శన చేసి నందమూరి స్వర్ణ నంది పురస్కారం, ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. అలాగే కురన్నపేట్ కాలనీకి చెందిన నిగులపు హరితకు నందమూరి నంది అవార్డు, ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. వీరిని నృత్యమాల నాట్య అకాడమీ శిక్షకురాలు ఏలేటి అంజలి రెడ్డి, పట్టణ ప్రజలు అభినందించారు.

## హైమాస్ట్ లైట్‌కు మరమ్మతులు



హైమాస్ట్ లైట్‌కు మరమ్మతులు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

నిర్మల్ అర్బన్, మే 29 : నిర్మల్‌లోని ఈద్గాం కాలనీలోని చౌరస్తాలో అధికారులు ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు వెలుగకపోవడంతో వాహనదారులు, పాదచారులకు అంధకారం నెలకొంది. దీంతో స్థానికులు హైమాస్ట్ లైట్‌కు మరమ్మతులు చేయించాలని అధికారులకు విన్నవించడంతో బుధవారం మున్సిపల్ ఎలక్ట్రిక్ సిబ్బంది మరమ్మతులు చేసి అంధకారాన్ని తొలగించారు.

## నర్సరీలు, హరితవనాలను కాపాడాలి



చందునాయక్‌తండాలో నర్సరీని పరిశీలిస్తున్న డీపీవో శ్రీనివాస్

ఖానాపూర్ రూరల్, మే 29: వేసవి నుంచి నర్సరీలు, హరితవనాలను కాపాడాలని నిర్మల్ జిల్లా పంచాయతీ శాఖాధికారి శ్రీనివాస్ అన్నారు. రాజురా గ్రామంలో శ్మశాన వాటిక, డంప్‌యార్డు, హరితవనాన్ని పరిశీలించారు. చందునాయక్ తండాలో హరితహారం, పల్లె ప్రకృతి వనం, నర్సరీని పరిశీలించారు. గ్రామాల్లో నీటి కొరత రాకుండా చూడాలన్నారు. గ్రామాల్లో చెత్తను డంప్‌యార్డుకు తరలించాలని కార్యదర్శులకు సూచించారు. ఆయన వెంట ఎంపీవో చంద్రశేఖర్, కార్యదర్శి రాణి, ఫీల్డ్ అసిస్టెంట్ అశోక్, గ్రామస్తులు పులివేణి సత్యనారాయణ ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★ అర్జెంట్‌గా హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ & ITI మెకానిక్స్ కావలెను. మంచి జీతం, వసతి సౌకర్యం కలదు. సంప్ర: 9392663777, 9246663777, 9290003999.
NT-339514-AII

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

# ఏకరూప దుస్తులు కుట్టించాలి



జైనథ్ : మహిళ టైలరింగ్ సభ్యులకు వస్త్రాన్ని అందజేస్తున్న ఎంపీడీవో రవీంద్రనాథ్

జైనథ్, మే 29: బడి పిల్లల ఏకరూప దుస్తులు మహిళా సంఘాల సభ్యులతోనే కుట్టించాలని ఎంపీడీవో రవీంద్రనాథ్ సూచించారు. బుధవారం ఐకేపీ కార్యాలయంలో మహిళ టైలరింగ్‌లకు ఏకరూప దుస్తులు కుట్టడానికి వస్త్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం 64 పాఠశాలల్లో 5286 మంది విద్యార్థులకు గాను ఒక్కొక్కరికి ఒక జత డ్రెస్ కోసం 11,538 మీటర్ల వస్త్రాన్ని అందజేశామన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జూన్ 10వ తేదీలోగా అన్ని పాఠశాలాలకు సంబంధించిన విద్యార్థులకు దుస్తులు కుట్టించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం భగవాండ్లు, ఎంఆర్‌సీ, సీఆర్పీ సుభాష్, వీవోఏలు పాల్గొన్నారు.

### సకాలంలో ఏకరూప దుస్తులు అందజేయాలి

ఉట్నూర్, మే 29: విద్యార్థులకు సకాలంలో ఏకరూప దుస్తులు అందజేయాలని ఐకేపీ ఏపీఎం అనిల్ అన్నారు. మండల కేంద్రంలోని కార్యాలయంలో మహిళా సంఘాలకు ప్రభుత్వ పాఠశాలల ఏకరూప దుస్తుల వస్త్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీసీలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



ఉట్నూర్ : వస్త్రాన్ని పంపిణీ చేస్తున్న ఏపీఎం అనిల్

# అ'పూర్వ' సమ్మేళనం



పూర్వ విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఉట్నూర్, మే 29 : ఉట్నూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో 1990-91 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు బుధవారం స్థానిక హెచ్‌కేజీఎన్ ఫంక్షన్ హాల్‌లో అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. ఆత్మీయ పలకరింపులు, ఆలింగనాల నడుమ నాటి చిన్ననాటి జ్ఞాపకాలు నెమరేసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు దుర్గం శేఖర్, నరేంద్ర బాబు, స్వామి, శ్రీనివాస్, అంజన్న, రమేశ్, మతిన్, వాణి, తదితరులు పాల్గొన్నారు.

## పెట్రోల్ బంకు స్థలం పరిశీలన



పెట్రోల్ బంకు పరిసరాలు పరిశీలిస్తున్న ఆర్డీవో, తహసీల్దార్

తాంసి, మే 29: హస్నాపూర్ గ్రామ సమీపంలో నూతనంగా నిర్మించనున్న పెట్రోల్ బంకు స్థలాన్ని బుధవారం ఆర్డీవో వినోద్ కుమార్, తహసీల్దార్ లక్ష్మితో కలిసి పరిశీలించారు. పరిసరాలను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారి వెంట మాజీ సర్పంచ్ నర్సింగ్, నాయకులు చందర్ రెడ్డి, సర్వేయర్ మనోజ్, ఆర్ఐ మహేందర్ ఉన్నారు.

# టీబీ నిర్మూలనకు ప్రజల భాగస్వామ్యం అవసరం




మాట్లాడుతున్న ఆదిలాబాద్ డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్

ఎదులాపురం, మే 29 : టీబీ 2025 నాటికల్ల పూర్తిగా నిర్మూలించడానికి వైద్య సిబ్బందితో పాటు ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్ అన్నారు. బుధవారం ఆదిలాబాద్ డీఎంహెచ్‌వో కార్యాలయంలో బీసీజీ టీకాపై మెడికల్ ఆఫీసర్లు, వైద్య సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటా సర్వే నిర్వహించి బీసీజీ టీకా అర్హులను గుర్తించి వివరాలను ఆరోగ్య సిబ్బంది నమోదు చేసుకోవాలన్నారు. జూన్ చివరి వారం నుంచి టీకా అందించేలా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. అనంతరం శిక్షకుడు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా టీకాలు ఎలా వేయాలని, ఎవరికి వేయాలో వివరించారు. సమావేశంలో డీఐవో వైసీ శ్రీనివాస్, జిల్లా టీబీ నియంత్రణ అధికారి సాయిప్రియ , డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ అతుల్, డాక్టర్ అశోక్ పాల్గొన్నారు.

## బియ్యం అందజేత

బోథ్, మే 29 : పొచ్చెర గ్రామంలో గురువారం నిర్వహించే అభయాంజనేయ స్వామి ఆలయ మొదటి వార్షికోత్సవం సందర్భంగా అన్నదాన కార్యక్రమానికి కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్ తనవంతుగా బియ్యం బస్తాలు అందజేశారు. మూడు క్వింటాళ్ల 50 కిలోల బియ్యాన్ని అందజేసినట్లు తెలిపారు.

# లో వోల్టేజీ సమస్యను పరిష్కరించాలి



ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న సామ రూపేశ్ రెడ్డి

జైనథ్(బేల), మే 29 : బేల మండలం బెదోడ గ్రామంలో ఏర్పడిన లో వోల్టేజీ సమస్యను సత్వరమే పరిష్కరించాలని యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేశ్ రెడ్డి మండల విద్యుత్ అధికారులు, లైన్ ఇన్‌స్పెక్టర్ రమేశ్‌కు సూచించారు. బుధవారం గ్రామస్తులు సమస్యను సామ రూపేశ్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన రూపేశ్ రెడ్డి స్వయంగా లైన్ ఇన్‌స్పెక్టర్ రమేశ్‌తో కలిసి గ్రామానికి వెళ్లి సమస్యకు గల కారణాలను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. లోవోల్టేజీ సమస్య లేకుండా అదనంగా ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఆయన వెంట గ్రామస్తులు దార్నె విజయ్, జీవన్, సురేందర్, సునీల్, గజానన్ ఉన్నారు.

# అందుబాటులో పత్తి విత్తనాలు



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పుల్లయ్య

ఎదులాపురం, మే 29 : ఆదిలాబాద్ జిల్లా రైతులు ఆందోళన చెందవద్దని, రాశి-659తో పాటు ఇతర కంపెనీల విత్తనాలు సైతం అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పుల్లయ్య తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 5 లక్షల 87వేల ఎకరాల సాధారణ సాగు విస్తీర్ణం ఉందన్నారు. ఈ సీజన్‌లో 4లక్షల 16వేల ఎకరాల్లో పత్తి సాగు చేసే అవకాశం ఉందన్నారు. జిల్లాలో 208 విత్తన షాపుల్లో రాశి 659 అనే రకం విత్తనాల సంచులు 2,27,308 ఉన్నాయని తెలిపారు. పట్టణంలోని విత్తన షాపుల్లో రాశి 659 విత్తనాల సంచులు 13,141 వచ్చాయన్నారు. రైతులు కొనుగోలు చేసిన విత్తన ప్యాకెట్లు, భద్రంగా ఉంచాలన్నారు. ఒకవేల సరైన దిగుబడి రాకపోయిన, నష్టం జరిగిన ఆ కంపెనీపై చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందన్నారు. మండలాల్లో, గ్రామాల్లో ఎవరైన పత్తి విత్తనాలు అమ్మడానికి వచ్చిన వారి వివరాలను పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సమావేశంలో ఏడీఏ రమేశ్, ఏవో శివకుమార్ పాల్గొన్నారు.